క్లుప్తంగా

కలెక్టర్‌కు జెడ్పీ చైర్‌పర్సన్ దంపతుల శుభాకాంక్షలు



గుంటూరు వెస్ట్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, కత్తెర సురేష్‌లు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో ఆయన్ను కలిసి కాసేపు ముచ్చటించారు. నూతన సంవత్సరం అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

పెన్షనర్లకు ఉచితంగా లైఫ్ సర్టిఫికెట్స్

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల ఆవరణలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా శాఖ కార్యాలయంలో ప్రభుత్వ పెన్షనర్లకు జీవన్ ప్రమాణం, ఐరిష్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్లు ఎంటర్ చేసి ప్రింట్ తీసి ఉచితంగా ఇస్తామని జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్. ముత్తయ్య తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. పెన్షనర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.హనుమంతరావు కోరారు.

యువకుడి అదృశ్యం

పట్నంబజారు: ఇంటి నుంచి వెళ్లిన యువకుడు కనపడకుండా పోయిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లచెరువుకు చెందిన మట్టుపల్లి తిరుపతి నాగయ్యకు లోకో పైలట్ ఉద్యోగం వచ్చింది. కొద్ది రోజుల నుంచి విజయవాడలో ట్రైనింగ్ తీసుకుంటున్నాడు. గత నెల 29న ఇంటికి వచ్చిన నాగయ్య, తిరిగి సోమవారం ట్రైనింగ్ సెంటర్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. అయితే, అక్కడకు వెళ్లలేదని, ఫోన్ సైతం స్విచ్ఛాఫ్ వస్తోందని నాగయ్య తల్లి వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇనుప రాడ్డుతో వ్యక్తిపై దాడి

ఇనుప రాడ్డుతో వ్యక్తిని గాయపరిచిన ఆటో డ్రైవర్‌పై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంజీవయ్యనగర్‌కు చెందిన పాటిబండ్ల వెంకటేశ్వర్లు ఆయన భార్య విక్టోరియా సోమవారం పనుల నిమిత్తం బస్టాండ్‌కు వచ్చారు. ఈ క్రమంలో ఆటో తగిలి విక్టోరియా కింద పడింది. దీనిపై డ్రైవర్ తాజుద్దీన్‌ను వెంకటేశ్వర్లు ఇదేమని ప్రశ్నించడంతో ఇద్దరి మధ్యా వివాదం ఏర్పడింది. ఆగ్రహం చెందిన తాజుద్దీన్ ఇనుప రాడ్డుతో వెంకటేశ్వర్లుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చురుగ్గా సర్వే పనులు



నెహ్రూనగర్: సంజీవయ్యనగర్ రైల్వే గేటు నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు వరకు మాస్టర్ ప్లాన్ ప్రకారం 80 అడుగుల విస్తరణకు సర్వే పనులు చురుగ్గా సాగుతున్నాయి. సోమవారం టౌన్ ప్లానింగ్ టీపీబీఓ రసూస్, ఈస్ట్ సర్వేయర్ హరికృష్ణ, సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలతో కలిసి సంజీవయ్యనగర్ మెయిన్ రోడ్డులో సర్వే చేపట్టారు. 80 అడుగుల మాస్టర్ ప్లాన్ ప్రకారం ఎంత వరకు మార్కింగ్ ఇవ్వాలనే అంశాన్ని పరిశీలించారు. కొద్ది రోజుల్లోనే రోడ్డు విస్తరణకు మార్కింగ్ చేసి పనులు ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు.

ప్రత్తిపాడు ఏఎంసీ పదవీ కాలం పొడిగింపు

ప్రత్తిపాడు: స్థానిక వ్యవసాయశాఖ మార్కెట్ యార్డు కమిటీ పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పాటు పొడిగిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ పదవీ కాలం గత ఏడాది అక్టోబరు 27వ తేదీతో ముగిసింది. మరో ఆరు నెలలు ప్రస్తుత కమిటీనే పొడిగిస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవ్ చౌదరి ఉత్తర్వులిచ్చారు.

పాము కాటుతో మహిళ మృతి



పెదనందిపాడు(కాకుమాను): వ్యవసాయ పనులకు వెళ్లిన మహిళ పాము కాటుకు గురై మృతి చెందిన ఘటన మండలంలోని వరగాని గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. తోటి కూలీలు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎస్సీ కాలనీకు చెందిన రేగులగడ్డ క్రీస్తురాజ్యం (40) వ్యవసాయ పనులకు వెళ్లింది. పని చేస్తుండగా.. పొలంలో ఆమెను పాము కాటు వేసింది. ఇది గుర్తించిన తోటి కూలీలు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి.. ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రజా వైద్యశాలకు తరలిస్తుండగా మార్గం మధ్యలో ఆమె మృతి చెందింది.

ఉత్తర ద్వార దర్శనం.. సకల పాప హరణం



శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పల్లకీ సేవలో భక్తులు



రామనామక్షేత్రంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

- భక్తిప్రపత్తులతో ముక్కోటి ఏకాదశి
- వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు

పాత గుంటూరు: ముక్కోటి ఏకాదశి సందర్భంగా నగరంలోని వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ నిర్వాహకులు స్వామివారిని విశేషంగా అలంకరించి గరుడ వాహనంపై ఉంచి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. తెల్లవారుజాము నుంచే స్వామిని దర్శనం చేసుకొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

■ లాలాపేట శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే షేక్ మహమ్మద్ ముస్తఫా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పాలక మండలి సభ్యులు, అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఉత్తర ద్వార దర్శనం చేసుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జయ ప్రకాష్‌రెడ్డి, కార్పొరేటర్ ఖాజా మొహిద్దీన్ చిష్టీ, కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

■ ఆర్. అగ్రహారం లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో నరసింహుడు తెల్లవారుజామున 5 గంటలకు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి దర్శనార్థమై తెల్లవారుజాము నుంచి భక్తులు క్యూలైన్‌లో బారులు తీరారు. స్వామివారిని దర్శించుకుని సేవించి తరించారు. కార్యక్రమాల్ని ఆలయ చైర్మన్ కోమండూరి శ్రీ రంగనాథ్, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్. మాధవీదేవి, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు పర్యవేక్షించారు.

■ ఆర్. అగ్రహారం శ్రీ రామనామ క్షేత్రంలో గరుడ వాహనంపై శ్రీ సీతారాములను భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. స్వామివారిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పాల కమండలి ట్రస్టీస్ రాగం వెంకట లీల సుందరి పాల్గొన్నారు.

■ ఆర్. అగ్రహారం శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున 5 గంటలకు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు స్వామి దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులకు బంగారు శంకుతో తీర్థం అందించారు. కార్యక్రమాన్ని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.

నగరపాలక సంస్థ స్పందనకు 21 ఫిర్యాదులు

- ఫిర్యాదులు నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలి
- అధికారులకు అదనపు కమిషనర్ పి.రోజా ఆదేశం



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ రోజా

నెహ్రూనగర్: ప్రతి సోమవారం జరిగే స్పందనలో అందే ఫిర్యాదులు నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేసి, ఫిర్యాదుదారుకు తెలియజేయాలని అదనపు కమిషనర్ పి.రోజా సచివాలయ కార్యదర్శులు, విభాగాధిపతులకు స్పష్టం చేశారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం స్పందన, సచివాలయ కార్యదర్శులతో జూమ్ ద్వారా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తొలుత సచివాలయ కార్యదర్శులతో మాట్లాడారు. సచివాలయం పరిధిలో ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అర్జీలు నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన నిర్వహించాలని చెప్పారు. అనంతరం గత వారం స్పందన ఫిర్యాదులు, స్పందన పోర్టల్, ఈఆర్‌పి, వాట్సాప్, కాల్ సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో, సంబంధిత కార్యదర్శులతో సమీక్షించారు. ప్రజల సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 21 ఫిర్యాదులు అందాయన్నారు. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి- 9, ఇంజినీరింగ్ విభాగానికి -6, ప్రజారోగ్య విభాగానికి- 2, రెవెన్యూ విభాగానికి- 3, ఉపా సెల్ -1 చొప్పున ఫిర్యాదులు అందాయని ఆమె వివరించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, సిటీప్లానర్ మూర్తి, డెప్యూటీ సిటీప్లానర్ కోటయ్య, సీఎంఓహెచ్ డాక్టర్ విజయలక్ష్మి, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, ఏసీపీలు, ఆర్ఓలు, ఈఈలు, ఎస్ఎస్‌లు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు

వచ్చే నెల 12న ఎంపీ కనిమొళి గుంటూరు రాక



వీరమణికి ఆహ్వాన పత్రాన్ని అందిస్తున్న ఆలా వెంకటేశ్వర్లు, కృష్ణారావు, కేశవులు

గుంటూరు మెడికల్: బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ విగ్రహావిష్కరణకు తమిళనాడు సీఎం స్టాలిన్ సోదరి, పార్లమెంట్ సభ్యురాలు కనిమొళి ఫిబ్రవరి 12న గుంటూరుకు వస్తున్నట్లు విగ్రహ కమిటీ కో-కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం చెన్నైలో కనిమొళినితో పాటు ద్రవిడ కజగం పార్టీ అధినేత కె. వీరమణిని విగ్రహావిష్కరణకు రావాలని ఆహ్వానించగా, వస్తామని చెప్పారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తనతో పాటు ద్రవిడ దేశం పార్టీ అధ్యక్షుడు వి.కృష్ణారావు, ఓబీసీ ఉద్యోగుల సంఘం నేత గొల్ల కేశవులు ఉన్నారని తెలియజేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



నూతన పింఛన్‌దారులతో కార్పొరేటర్ శ్యామల తదితరులు

గుంటూరు రూరల్: ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారని 26వ డివిజన్ కార్పొరేటర్ శ్యామల వెంకటరమణాదేవి పేర్కొన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని అంకిరెడ్డిపాలెంలో నూతనంగా మంజూరైన 150 పింఛన్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలను వలంటరీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల ఇంటి ముందుకు అందజేస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. నూతన పింఛన్‌దారులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్ శ్యామల బ్రహ్మారెడ్డి, వార్డు సచివాలయం సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో నూతన సంవత్సర వేడుకల సందడి



కేక్ కట్ చేస్తున్న వీసీ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఆదివారం సెలవు కావడంతో సోమవారం నిర్వహించారు. పరిపాలనా భవన్‌లో జరిగిన వేడుకల్లో వీసీ ఆచార్య పి. రాజశేఖర్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో సమష్టిగా యూనివర్సిటీని మరింత అభివృద్ధి చేద్దామని సూచించారు. గత ఏడాది కాలంలో యూనివర్సిటీ అనేక జాతీయ, అంతర్జాతీయ ర్యాంకులు సాధించిందని, ఆ స్ఫూర్తితో మరిన్ని సాధించడంతోపాటు మంచి నాక్ గ్రేడ్ సాధించేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. విద్య, పరిశోధన, మౌలిక వసతులు, క్రీడా రంగాలలో ప్రపంచ స్థాయిలో యూనివర్సిటీ ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ప్రత్యేకంగా ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ బి. కరుణ, ఓఎస్‌డీ కె. సునీత, సీడీసీ డీన్ కె. మధుబాబు, పీజీ పరీక్షల కోఆర్డినేటర్ ఎల్. ఉదయకుమార్, దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ బి. నాగరాజు, పలువురు అధికారులు పాల్గొన్నారు. యూనివర్సిటీ ఉద్యోగ సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ఉన్నతాధికారులకు పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. యూనివర్సిటీ అధ్యాపకేతర సిబ్బంది సంఘం(వికాస), ఎంప్లాయిస్ యూనియన్, రోజువారీ వేతన ఉద్యోగుల సంఘాల క్యాలెండర్లను వీసీ ఆవిష్కరించారు.

ఉర్దూ భాషా ప్రావీణ్యంతో ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఖాసీం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉర్దూ భాషా ప్రావీణ్యంతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ మొహ్మద్ ఖాసీం పేర్కొన్నారు. ఆయన సోమవారం ఏటీ అగ్రహారంలోని ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులతో పాటు విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల్ని పరిశీలించారు. విద్యార్థుల వర్క్ బుక్స్, నోట్ బుక్స్ తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సయ్యద్ అబ్దుల్ కరీం, షేక్ హుస్సేన్‌లకు పలు సూచనలు చేశారు. పాఠ్యాంశాల్ని విధిగా ఉర్దూలో బోధించాలని, ఆ భాషతో మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలసి జగనన్న గోరుముద్దను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలు ప్రతి విద్యార్థికి అందే విధంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల వివరాల్ని ఆన్‌లైన్‌లో పొందుపర్చే విధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



రాజరాజేశ్వరిని అభినందిస్తున్న విష్ణువర్ధన్, కృష్ణవేణి, పద్మజ, వరప్రసాదరావు

పాత గుంటూరు: వైకుంఠ ఏకాదశి సందర్భంగా అరండల్‌పేట 7వ లైనులోని శ్రీ మోహన రంగనాయకస్వామి దేవస్థానంలో సోమవారం మహంకాళి సూర్యనారాయణశర్మ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వాతాపి గణపతి, బ్రహ్మాంజలి, గణపతి ప్రార్థన, మానస సంచరే, అలరులు కురియగ ఆడినదే, నారాయణతే నమో నమో తరంగం, మాధవ కేశవ అన్నమాచార్య కీర్తనలకు చిన్నారులు రేష్మిత, వైష్ణవి, లిఖిత, నందన, నిర్వియశస్వి, పద్మ నృత్యాలు అలరించాయి. కార్యక్రమాన్ని మహంకాళి నాగలక్ష్మి పర్యవేక్షించారు.

ఎస్టీయూ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న ఎంఈవో సీహెచ్. రమాదేవి

ప్రత్తిపాడు: స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈఓ సీహెచ్ రమాదేవి ఎస్టీయూ డైరీ, క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడు నజీర్, ప్రధాన కార్యదర్శి నాని, ఉపాధ్యాయులకు ఎంఈవో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు వెంకటరెడ్డి, రమణ, అంజయ్య, నాగేశ్వరరావు, వెంకట్రావు, సదాశివరావు, సత్తార్, పిచ్చేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా మల్లేశ్వరస్వామి గ్రామోత్సవం



పెదకాకాని: ముక్కోటి పర్వదినం సందర్భంగా పెదకాకానిలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో రుద్రాభిషేకాలు, అమ్మవారికి ప్రత్యేక పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. గుంటూరుకు చెందిన బండ్లమూడి అజయ్‌కుమార్, ఉమాదేవి కుటుంబ సభ్యులు రూ.4లక్షలతో తయారు చేయించిన రథాన్ని ఈఓ శ్రీనివాసరెడ్డికి అందజేశారు. ముక్కోటి సందర్భంగా పెదకాకాని పుర వీధుల్లో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు.

పేదలకు సాయం చేసేందుకు ముందుకు రావాలి

గుంటూరు రూరల్: పేదలు, అనాథలు, వృద్ధులకు సాయం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని వెస్లీ సర్వీసెస్ సంస్థ ఫౌండర్ చీకటి జాన్‌వెస్లీ తెలిపారు. మండలంలోని దాసరిపాలెం ప్లాట్స్‌లో సోమవారం పేదలకు నిత్యావసర సరుకులు, కూరగాయలు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వెస్లీ మాట్లాడుతూ కాలనీలోని 30 కుటుంబాలకు బియ్యం, కందిపప్పు, ఇతర సరకులు, కూరగాయలు అందజేసినట్లు తెలిపారు. ప్రతి నెలా మండల పరిధిలోని గ్రామాల్లో 175 పేద కుటుంబాలకు తమ వంతుగా నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఎవరికైనా ఆహారం అందక ఇబ్బందులు పడుతుంటే తమను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సానిక చర్చి పాస్టర్ స్టీఫెన్, ప్రజలు పాల్గొన్నారు.

'ప్రజల ప్రాణాలతో చంద్రబాబు చెలగాటం'

నెహ్రూనగర్: గుంటూరులో జరిగిన చంద్రబాబు సభలో ముగ్గురు మరణించడం బాధాకరమని, తన స్వార్థ రాజకీయాల కోసం, ప్రచారం కోసం ఆయన ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటం సిగ్గుచేటని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ బోరుగడ్డ అనిల్‌కుమార్ ఖండించారు. నాలుగు రోజుల కిందట కందుకూరులో ఎనిమిది మంది ప్రాణాలు పోయిన ఘటన మర్చిపోక ముందే ఆదివారం గుంటూరులో ఇటువంటి ఘటన జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. సోమవారం గుంటూరులో నిర్వహించిన సమావేశంలో అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఘటనలకు కారకుడైన చంద్రబాబునాయుడుపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, రానున్న రోజుల్లో ఎక్కడా సభలు, సమావేశాలు నిర్వహించడానికి అనుమతులు ఇవ్వకూడదని డిమాండ్ చేశారు.

హ్యాపీ న్యూ ఇయర్ సర్



ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతున్న కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల మంజూరు

నగర మేయర్ కావటి



ఫించన్ అందజేస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పారదర్శకమైన పాలన అందిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల్ని అందిస్తున్నారని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు తెలిపారు. సోమవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 19, 20వ డివిజన్ల పరిధిలో 105 మందికి నూతనంగా ప్రభుత్వం మంజూరు చేసిన పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారని, ఇచ్చిన హామీల్లో 95 శాతం పైగా నెరవేర్చారని తెలిపారు. ఇచ్చిన హామీలే కాక ప్రజా సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి లబ్ధిదారులకు అందజేస్తున్నారని చెప్పారు. అర్హతే ప్రామాణికంగా, కుల, మత పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల్ని అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. పథకాల మంజూరు కోసం ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ఇచ్చిన హామీ మేరకు ఈ నెల నుంచి రూ. 2500 నుంచి రూ. 2750 పెంచిన పెన్షన్‌ను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ల ప్రెసిడెంట్లు కంతేటి శ్యాం శేఖర్, ఖాజామొహిద్దీన్, టెంట్ హౌస్ బాబు, బాలరాజు, కవిత, ఫాతిమా, షకీలా, సచివాలయాల కార్యదర్శులు, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

షాట్‌పుట్‌లో టీజేపీఎస్ విద్యార్థికి బంగారు పతకం



వెంకయ్యను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మనోహర్

గుంటూరు ఎడ్యుకేషన్: నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో ఇటీవల జిల్లాస్థాయిలో నిర్వహించిన ఆటల పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన టీజేపీఎస్ డిగ్రీ కళాశాల బీకాం ద్వితీయ సంవత్సర విద్యార్థి పి. వెంకయ్య బంగారు పతకాన్ని పొందినట్లు ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ తెలిపారు. పట్టాభిపురంలోని కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్క విద్యార్థి చదువుతో పాటు ఆటలపై దృష్టిసారిస్తే ఉద్యోగాల్ని సాధించడంతో పాటు శారీరకంగాను ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. కళాశాల కరస్పాండెంట్ తెల్లాకుల శ్రీనివాసబాబు మాట్లాడుతూ బంగారు పతకాన్ని సాధించిన విద్యార్థి వెంకయ్యకు విద్య, ఆటల పరంగా సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకుడు డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ భానుమురళీధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బజాజ్ చేతక్ ఎలక్ట్రిక్ వాహనం మార్కెట్లోకి విడుదల



వాహనాన్ని విడుదల చేస్తున్న మేయర్ మనోహర్‌నాయుడు

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని శ్రీ సిద్ధి వినాయక బజాజ్ షోరూంలో సోమవారం పూణె బజాజ్ ఆటో లిమిటెడ్ తయారు చేసిన బజాజ్ చేతక్ (ఎలక్ట్రికల్ వెహికిల్)ను మార్కెట్లోకి విడుదల చేశారు. ముఖ్య అతిథిగా మేయర్ కావటి మనోహర్‌నాయుడు పాల్గొని, వాహనాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ రేట్లు, కాలుష్య రహిత వాహనాల్ని ప్రజలు ఎక్కువగా ఆదరిస్తున్నారని తెలిపారు. సంస్థ జీఎం జి. శ్రీనివాస్ మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీతో తయారు చేసిన చేతక్ ఎలక్ట్రికల్ వాహనానికి వాటర్ ప్రూఫ్ బ్యాటరీ కూడా అమర్చినట్లు చెప్పారు. యూఎస్‌బీ చార్జర్ ప్రత్యేకత కలిగి బ్లాక్, బ్లూ, రెడ్ రంగులలో వాహనం లభ్యమవుతుందని పేర్కొన్నారు. షోరూం చైర్మన్ కె.వి. బాబుల్‌రెడ్డి మాట్లాడుతూ 27 ఏళ్ల నుంచి వినియోగదారుల మన్ననల్ని సంస్థ పొందుతోందని చెప్పారు. కార్యక్రమంలో ఎండీ సీతారామ్, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ గులాం రసూల్, సిబ్బంది పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్‌లో రాజరాజేశ్వరికి కాంస్య పతకం



రాజరాజేశ్వరిని అభినందిస్తున్న విష్ణువర్ధన్

గుంటూరు ఎడ్యుకేషన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గత నెల 31న రాజమహేంద్రవరంలో నిర్వహించిన అంతర్ జిల్లా రైఫిల్ షూటింగ్ పోటీల్లో శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థిని అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 9వ తరగతి విద్యార్థిని రాజరాజేశ్వరి కాంస్య పతకాన్ని సాధించడం పాఠశాలకు గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ఉపాధ్యాయులు అభినందించారు.